క్లుప్తంగా

స్వామివారి సేవలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని విశాఖపట్నానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్ధు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌యార్డు రోడ్డు, హైస్కూల్ రోడ్డు, బందరుకోట, గిలకలదిండి, గరాలదిబ్బ, పోర్టు రోడ్డు, పాతరామన్నపేట, జవ్వారుపేట, సర్కిల్‌పేట, జలాల్‌పేట, ఇనుగుదురుపేట, ఫత్తుల్లాబాద్, ఉల్లింగిపాలెం, సుకర్లాబాద్, ఇంగ్లీషుపాలెం, బచ్చుపేట, రామానాయుడుపేట, పరాసుపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

మండల పరిధిలో..

బందరు మండల పరిధిలోని పోతేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ భాస్కరరావు తెలిపారు. గోపువానిపాలెం, మేకవానిపాలెం, నవీన్ మిట్టల్ కాలనీ, జ్యూయలరీ పార్కు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

వైభవంగా రవిక పూజా మహోత్సవం

గణపేశ్వరం(నాగాయలంక): అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక దుర్గా-గణపేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి రవిక (జాకెట్) పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక మండలి ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి, అరుణ దంపతులు ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి బ్రహ్మత్వంలో విశేష పూజలో పీటలపై కూర్చున్నారు. టి.కొత్తపాలెం, పర్రచివర, తలగడదీవి, బర్రంకుల, దిండి తదితర గ్రామాల నుంచి విచ్చేసిన మహిళలు రవిక పూజలో పాల్గొన్నారు. భక్తులు తీసుకొచ్చిన జాకెట్ ముక్కలకు ప్రత్యేక పూజలు జరిపి వాటిని తిరిగి మళ్లీ వారికే అందించారు. కనకదుర్గమ్మ భక్త సమాజం అధ్యక్షుడు పిరాటి శ్రీనివాసరావు, సభ్యులు దేవదాయ శాఖ ఉద్యోగులు సేవలు అందించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



బంటుమిల్లి: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొలాలని కోరుతూ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన పలు క్రైస్తవ సంఘాల సభ్యులు శుక్రవారం బంటుమిల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల సంఘస్తులు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ఎంవీ సత్యనారాణకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ, సీపీఎం నేతలు ర్యాలీకి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. రాజబాబు, ఎస్. మహేష్, పి. బాబూరావు, కె. సుబ్బారావు, సీపీఎం నాయకులు వై. నరసింహారావు, జి. నాగేశ్వరరావు, ఎల్. అజయ్‌ఘోష్, ఎం. శ్రీనివాసరావు, పి. ధనశ్రీ, ముస్లిం పెద్దలు ఎండీ కమాల్‌బాషా, ఎస్కే బాషీ, మస్తాన్, షానూరు, పలు గ్రామాల పాస్టర్లు జాషువా, ఏలియా, ప్రభుదాసు, సుధాకర్, మాజీ సర్పంచ్ ఎ. శ్యాంసోన్, దానియేలు సంఘస్తులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

పాగోలు(చల్లపల్లి): ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి అన్నారు. శుక్రవారం పాగోలులో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను డీఏఓ పద్మావతి పరిశీలించారు. రైతులకు ఈ క్రాప్ ప్రయోజనాలను వివరించారు. ధాన్యం కొనుగోలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పంట రుణాలు ఈ క్రాప్ ద్వారా లభిస్తాయని చెప్పారు. రైతులు తమ పొలం పాస్ బుక్, ఆధార్ జిరాక్సులు, ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఏ పంట, ఏ రకం సాగు చేస్తున్నారో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 15లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఏడీఏ ఎస్. శ్యామల, ఏఓ జి.సాయిసింధు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో కోసూరివారిపాలెం

- నియోజకవర్గంలో ముందున్న గ్రామం
- రూ. 3.50 కోట్లతో గ్రామాభివృద్ధి
- రూ. 47 లక్షలతో ప్రజలకు తాగునీరు
- ప్రశంసలందుకుంటున్న సర్పంచ్ అనూష

కోసూరువారిపాలెం(మోపిదేవి): మోపిదేవి మండలం కోసూరువారిపాలెం గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. సర్పంచ్ కోసూరు అనూష నిరంతర కృషి, పట్టుదలతో రెండున్నరేళ్లలోనే సుమారు రూ. 3.50 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసి గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది. కృష్ణానది ఒడ్డున అభివృద్ధికి దూరంగా ఉన్న పరీవాహక ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. తరచూ నది సముద్రం ఆటుపోటుకు గురికావడంతో భూగర్భ జలాలు ఉప్పుగా మారాయి. మంచినీటి కోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడేవారు. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు కేంద్రం ఇచ్చిన రూ. 42 లక్షలకు తోడు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఇచ్చిన రూ. 5 లక్షలు మొత్తం రూ. 47 లక్షలతో మండలంలోనే తొలిసారిగా జల్‌జీవన్ మిషన్‌కు శ్రీకారం చుట్టి త్వరితగతిన పూర్తి చేశారు. ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించి ప్రజల దాహార్తిని తీర్చారు.

అభివృద్ధి ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ. 43.50 లక్షలు, హెల్త్ క్లినిక్ భవనానికి రూ. 20 లక్షలు మంజూరు చేయగా వాటిని పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంచేశారు. రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) భవనానికి రూ. 19 లక్షలు కేటాయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. మన బడి నాడు-నేడు కింద తొలి దశలో ప్రాథమిక పాఠశాలను రూ. 19 లక్షలతో అభివృద్ధి చేశారు. జెడ్పీ పాఠశాలకు రెండో ఫేజ్‌లో రూ. 1.28 కోట్లతో పనులు జరుగుతున్నాయి. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేటాయించిన రూ. 20లక్షలతో సీసీ రోడ్లు వేశారు. ఎంపీ బాలశౌరి నిధులు రూ. 10 లక్షలతో సీసీ రోడ్లు, అసంపూర్తిగా నిలిచిన కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలతో పనులు నిర్వహించారు. ఎంపీ నిధులు మరో రూ. 5 లక్షలు కూడా మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీకి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 16 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన రూ. 10 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. మరో రూ. 5.50 లక్షలు కూడా నిధులు మంజూరయ్యాయి. గ్రామ సచివాలయ భవన నిర్మాణం సమీపంలోనే రూ. 3 లక్షలతో పబ్లిక్ టాయ్‌లెట్లు నిర్మించారు.



నాడు-నేడుతో సుందరంగా మారిన ప్రాథమిక పాఠశాల భవనం



గ్రామ సచివాలయ భవనం

గ్రామస్తుల భాగస్వామ్యం..

గ్రామాభివృద్ధికి తమ వంతు సాయంగా గ్రామస్తులు ముందుకు వచ్చారు. ప్రముఖ కాంట్రాక్టర్ బడే రామకృష్ణారావు వారి తాత బడే కోటేశ్వరరావు, అత్త గరికిపాటి రేణుకమ్మ పేరున ఆరోగ్య ఉప కేంద్రం (హెల్త్ సెంటర్), అమూల్ కేంద్ర భవన నిర్మాణాలకు 8 సెంట్ల స్థలం ఉచితంగా అందజేశారు. స్థానికులు కూడా తమ వంతుగా రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి 6 సెంట్ల స్థలం సమకూర్చారు. నియోజకవర్గ స్థాయిలోనే గ్రామాభివృద్ధిని ముందుండి నడిపిస్తున్న సర్పంచ్ అనూషకు గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

మంచినీరు ఇచ్చారు



కృష్ణానది ఒడ్డున ఉండటం వల్ల భూ గర్భ జలాలు ఉప్పుగా మారాయి. బోరు పంపుల నీరు కూడా ఉప్పగా వస్తున్నాయి. జగనన్న ప్రభుత్వంలో సర్పంచ్ అనూష కృషితో ఇంటింటా కుళాయి ఏర్పాటు చేయడంతో మంచి నీరు తాగుతున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– సనకా వెంకట నరసమ్మ, కోసూరువారిపాలెం

హెల్త్ క్లినిక్‌తో ఎంతో మేలు



హెల్త్ క్లినిక్‌తో గర్భిణులు, బాలింతలతో పాటు వృద్ధులు, పిల్లలకు ఎంతో మేలు జరుగుతోంది. దూరప్రాంతాలకు పోలేక 2019 ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు హెల్త్ క్లినిక్ ప్రాముఖ్యతను వివరించాం. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించి ఈ క్లినిక్ ఏర్పాటు చేశారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– సనకా లక్ష్మణస్వామి, కోసూరువారిపాలెం

సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు



గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు అవుతున్నారు. నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో వెన్నంటి నడుపుతున్న స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు గ్రామస్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు.

– సర్పంచ్ అనూష, కోసూరువారిపాలెం

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- మంత్రి జోగి రమేష్
- పెడన నియోజకవర్గంలో 57,126 మందికి లబ్ధి

పెడన: మహిళాభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా పేద అక్క చెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డబ్బులు జమ చేశారని చెప్పారు. పెడన నియోజవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 5,293 స్వయం సహాయక సంఘాల్లోని 57,126 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 6.47కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని వివరించారు. వరుసగా నాలుగో ఏడాది శుక్రవారం వైఎస్సార్ సున్నా వడ్డీని పేద అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా రుణపడి ఉంటామని మంత్రి చెప్పారు.

ఓటర్ల సర్వేను వేగవంతం చేయండి

పెడన మున్సిపల్ కమిషనర్ మహేంద్ర

పెడన: సమయం తక్కువగా ఉందని, సమగ్ర ఓటర్ సర్వే ప్రక్రియను వేగవంతంగా పారదర్శకంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర బీఎల్‌ఓలను ఆదేశించారు. కమిషనర్ తన చాంబర్‌లో పట్టణంలోని బీఎల్‌ఓలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 24,565 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో ఇప్పటి వరకు 14,130 మంది ఓటర్లను పరిశీలించారన్నారు. 25 మంది బీఎల్‌ఓలు తమ పరిధిలోని మిగిలిన పదివేల మందికిపైగా ఉన్న వారిని త్వరితగతిన పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అదే విధంగా కొత్తగా ఓటరుగా చేరాలనుకునే వారిని ఆధారాలతో చేర్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో టీపీఓ వి ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి..



యండపల్లి సచివాలయం వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీడీఓ తదితరులు



మడక పాఠశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీడీఓ రెడ్డయ్య తదితరులు



కప్పలదొడ్డిలో మొక్క నాటుతున్న సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ తేజోవతి



సార్లగొందిలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



సాలెంపాలెంలో శిలాఫలకం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు

పెడన: మహనీయుల త్యాగాలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. మడక గ్రామ సచివాలయం పరిధిలోని ఎంపీపీ పాఠశాలలో నా భూమి-నా దేశం శిలాఫలకాన్ని ఎంపీడీఓ వి. రెడ్డయ్య ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ జోగి వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. శేరివ త్తర్లపల్లిలో సర్పంచ్ వెంకటనాగలక్ష్మి మొక్కలు నాటారు. కొప్పల్లిలో ఎంఈఓ వైవీ హరబాబు, ముచ్చర్లలో ఈఓపీఆర్డీ ఎం. జయరాం, నడుపూరులో సర్పంచ్ చీర్ల అనూష, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శిలాఫలకాల ఆవిష్కరణ..

గూడూరు: దేశ స్వాతంత్ర్యం కోసం ఆశువులు బాసిన అమర వీరుల త్యాగాలను స్మరించేందుకు ప్రభుత్వం నా భూమి- నాదేశం కార్యక్రమం నిర్వహిస్తోందని కప్పలదొడ్డి సర్పంచి యక్కల మాధవి అన్నారు. కప్పలదొడ్డిలో నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సర్పంచి ప్రారంభించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కంకటావ, కోకనారాయణపాలెం, మల్లవోలు, ముక్కొల్లు, నారికేడలపాలెం, పినగూడూరులంక గ్రామాల్లో నా భూమి- నా దేశం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

సార్లగొంది(నాగాయలంక): మండలంలోని సార్లగొంది, నాలి, గణపేశ్వరం, కమ్మనమోలు, నంగమేశ్వరం, నంగేగడ్డ గ్రామాల్లో నా భూమి-నా దేశం కార్యక్రమాలు నిర్వహించారు. శిలాఫలకాలను, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించి అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంఈఓ-2 ఎ.రామారావు, ఏఓ (అగ్రికల్చర్) ఎ.స్టీవ్ కుమార్, పీఆర్ ఏఈ జేకే సీతారామ్ కుమార్ నేతృత్వంలో బృందాలుగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

కోడూరు: సాలెంపాలెం, లింగారెడ్డిపాలెం, హంసలదీవి పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పంచాయతీ సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులకు నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాగోలు(చల్లపల్లి): బ్రిటిష్ పోలీసులు లాఠీలతో కొడుతున్నా వెన్ను చూపక జాతీయ పతాకాన్ని ఎగురవేసి మహాత్మాగాంధీతో జెండా వీరుడు అని బిరుదు పొందిన తోట నరసయ్య నాయుడు స్వగ్రామం పాగోలు కావడం గర్వకారణమని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి అన్నారు. శుక్రవారం పాగోలు గ్రామ సచివాలయంలో నా భూమి - నా దేశం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ తోట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్యాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలను స్మరిద్దాం

కృత్తివెన్ను: స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో అమర వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, ఆ మహనీయులను త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించాలని ఎంపీడీఓ పిచ్చిబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యండపల్లి సచివాలయం వద్ద నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. సర్పంచ్ పి. ప్రభుప్రసాద్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. లక్ష్మీపురం, ఇంతేరు, పడతడిక, సీతనపల్లి గ్రామ సచివాలయాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ఎం. రత్నకుమారి, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంఈఓ ప్రసాద్, ఏఓ జెన్నీ పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగన్నచెరువు, చోరంపూడి, మల్లంపూడి, ములపర్రు, బర్రిపాడు గ్రామాల్లో తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఏఓ శివరామకృష్ణ, ఎంఈఓ ఎ. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఏపీఓ ముత్యాలు సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

గూడూరు: కోకనారాయణపాలెం సర్పంచితో పాటు జక్కంచర్ల, ఆకులమన్నాడు, పోలవరం గ్రామాల్లోని వార్డులకు జరుగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సర్పంచితో పాటు వార్డు సభ్యులకు దాఖలైన నామినేషన్లన్నీ సక్రమంగా ఉన్నాయని ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో కోకనారాయణపాలెం పంచాయతీ సర్పంచి స్థానానికి ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. బండి అంజలీకుమారి, బండి లీలాప్రతాప్, పుప్పాల సురేష్, దాసరి ఉపాసాయిరామ్, చోడగం భిక్షాలరావు పోటీలో ఉన్నారు. పోలవరం 11వ వార్డుకు పిచ్చుక విజయనాగ వెంకట లక్ష్మి, పిచ్చుక శ్యామల, వీరంకి నాగమణి, రేపల్లె వెంకటేశ్వరమ్మలు నామినేషన్లు సమర్పించగా వారందరి నామినేషన్లు ఆమోదించారు. జక్కంచర్లలో ఒకటో వార్డుకు సంబంధించి వెన్న వెంకట భారతి, ఆత్మూరి రజని నామినేషన్లు ఆమోదించారు. ఆకులమన్నాడు రెండో వార్డుకు సంబంధించి మిర్యాల వెంకటేశ్వరరావు, శాయన రమా భ్రమరాంబ నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 14న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

అన్ని నామినేషన్లు సక్రమమే..

పెడన: మండల పరిధిలోని కొంగంచర్ల సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి దాఖలైన నాలుగు నామినేషన్లు, కాకర్లమూడి నాలుగో వార్డుకు సంబంధించిన రెండు నామినేషన్లను శుక్రవారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. కొంగంచర్ల సర్పంచ్ పదవికి లోయ ఊహ, లోయ ద్రాక్షాయణమ్మ, పుట్టి శ్యామల, పుట్టి నాగజ్యోతి వేసిన నామినేషన్లను ఎన్నికల అధికారి, చల్లపల్లి ఈఓపీఆర్డీ అశోక్ కుమార్ పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయని తెలిపారు. సహాయ ఎన్నికల అధికారి షేక్ అహ్మద్ పాల్గొన్నారు. కాకర్లమూడి పంచాయతీ నాలుగో వార్డుకు గుడిసె లక్ష్మీ తిరుపతమ్మ, గుడిసె రత్నకుమారి వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఎన్నికల అధికారి, నాగాయలంక ఈఓపీఆర్డీ అప్పల నరసమ్మ తెలిపారు. సహాయ ఎన్నికల అధికారి బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కృష్ణా యూనివర్సిటీ వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జ్ఞానమణి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు తనూజను వీసీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయకుమారి, రెక్టార్ ప్రొఫెసర్ డి. సూర్యచంద్రరావు, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెడన: ఆర్ఎంపీ సంక్షేమ సంఘం పెడన ఏరియా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణంలోని తోటమూలలో పెడన ఆర్ఎంపీ డబ్ల్యూ ఏరియా ముఖ్య నాయకులు, కార్యవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. పెడన ఏరియా నూతన కార్యవర్గ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎం. రాజలింగం, అధ్యక్షుడిగా పి. రవీంద్ర, ఉపాధ్యక్షులుగా పి. శివ, పి. నాంచారయ్య, కార్యదర్శిగా బి.కిరణ్‌కుమార్, కోశాధికారిగా ఆశపు రాము, సంయుక్త కార్యదర్శులుగా బి. సాయి, పి. సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా పి. నాగేశ్వరరావు, జి. శ్యామలరావు, పేరక నాగేశ్వరరావు, అనుమోలు ముకుందరావు, కాసా ప్రసాద్ ఎన్నికయ్యారు.

నేడు చోడవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం చోడవరం గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నందిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని దావోజీపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 52/2019 in O.S.No. 374/2011

Between :

Olla Ramesh ... D.Hr

And

Makani Anilkumar ... J.Dr

యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట ది. 11-09-2023న ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి వేలం వేయబడును. కావున పాడుకొనదలచినవారు వచ్చి పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా మచిలీపట్నం నందు యున్నటువంటిన్నీ యీ నెంబరు ద్వారా బాకీకి హామీగా ఎటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంటు కాబడినటువంటిన్నీ యీ నెంబరు డిక్రీ బాకీ క్రింద వేలం కావలసిన J.Dr. యొక్క స్థిరాస్తి వివరం : నెం. 4, రాజుపేట, డోర్ నెం. 4/900కు లోని చ॥గ॥ 150లు లేదా చ॥మీ॥ 125.400 ల ఖాళీ నివేశ స్థలంకు హద్దులు. తూర్పు : శిశినం శీరిష స్థలం మరియు నడక దారి. 4 అ॥, దక్షిణం : బీరం రామారావు ఇంటి స్థలం, పడమర : రంగన్న, కొండయ్య వగైరాల స్థలం, ఉత్తరం : ఆయంచ శేషాచార్యులు ఇల్లు, స్థలం. యీ హద్దుల మధ్య చ॥గ॥ 150 లు లేదా చ॥మీ॥ 125.400 లు ఖాళీ నివేశ స్థలం.

D.Hr. కిమ్మత్తు : రూ. 4,00,000/-.

అమీనా కిమ్మత్తు : రూ. 4,50,000/-

రిజిస్ట్రార్ కిమ్మత్తు : రూ. 10,50,000/-.

గమనిక : ECదాఖలా ఏమైనా లావాదేవీలు వున్నా అవి చెల్లనేరవు. వేలం తేదీ : 11-09-2023

మచిలీపట్నం | వి.వి. వరదరాజులు
ది. 11-8-23 | D.Hr. తరఫున న్యాయవాది

పేదల కష్టాలు తెలిసిన సీఎం జగన్

పేర్ని కిట్టు



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): పేదల కష్టాలు తెలుసుకుని వారిని సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 26వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పేర్ని కిట్టు డివిజన్‌లోని గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అన్నివర్గాలకు మేలులు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే మరిన్ని మేలులు జరుగుతాయని చెప్పారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి మాడపాటి వెంకటేశ్వరరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులదూషణ కేసులో రెండేళ్ల జైలు

చిలకలపూడి(మచిలీపట్నం): కులం పేరుతో దూషించిన కేసులో రెండేళ్ల జైలు శిక్ష, రూ. 4,500 జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎ. నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన కొంకలూరు శ్రీను అదే గ్రామానికి చెందిన గంజర్ల నవీన్‌ను 2017 నవంబర్ 14వ తేదీన అడ్డగించి చేతులతో కొట్టి కులం పేరుతో దూషించాడు. బాధితుడు నవీన్ చందర్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించి ఏపీపీ కమ్మగంటి చంద్రశేఖర్ ఎనిమిది మంది సాక్షులను విచారణ చేశారు. నిందితుడు శ్రీనుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పలు సెక్షన్ల కింద రెండేళ్ల జైలుశిక్ష, రూ. 4,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎస్టీలకు ఇళ్లస్థలాల కేటాయింపు

కోడూరు: మండలంలోని కృష్ణాపురం కాలువ గట్టు వెంట నివాసముంటున్న ఎస్టీ కుటుంబాలకు రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలను కేటాయించారు. కాలువ గట్టు మీద ఉంటున్న ఐదుగురు ఎస్టీ కుటుంబాలకు గతంలో జయపురం లే అవుట్లలో ఇళ్లస్థలం కేటాయించారు. అయితే ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఈ లే అవుట్ విషయమై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇళ్లస్థలాల పంపిణీకి బ్రేక్ పడింది. ఎస్టీ కుటుంబాల వారు ఇబ్బంది పడకుండా దింటిమెరక-2 లే అవుట్‌లో వీరికి ఇళ్ల స్థలాలను కేటాయించామని తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా తెలిపారు. సోమవారం వీరందరికీ ఇళ్లపట్టాలను పంపిణీ చేస్తామన్నారు. శుక్రవారం ఎస్టీ కుటుంబాల సభ్యులను తహసీల్దార్ కలిసి ఈ విషయాన్ని వారికి వివరించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పమిడిముక్కల: విలువలతో కూడిన విద్య అవసరమని ఉయ్యూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్ అన్నారు. కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు కావలసిన స్కిల్స్ నేర్చుకోవడంలో శ్రద్ధ చూపాలని చెప్పారు.